# ఖైదీ విషాదగాథ

శ్రీ జనస్వామి కోదండరామశాస్త్రి

జైలుగంట గణగణమని ధ్వనిస్తూ గాఢసుషుప్తిలో మునిగివున్న ఆ నిర్బంధజీవుల్ని కొద్ది కొద్దిగా మేల్కొల్పుతోంది. యీ నరకానికి కారణంగాగల నేరాల చరిత్రలోని విషమఘట్టాల్ని వర్ణించి ఖైదీల శ్రవణపుటాల్లో పైశాచికగానం సల్పుతూ గత రాత్రంతా వ్యథతో చితికిపోయిన హృదయాల్లో మరల కలతలకు తావు కల్పిస్తున్నాయి, ఆ భయంకర ఘంటా నాదాలు. గుమ్మాలకు బిగించివున్న ఇనుప చువ్వల్లో గుండా లోపలకు అరుణోదయపు లేతకాంతులు బలవంతంగా తోసుకునివెళ్లి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ మెల్లిమెల్లిగా కళ్లు విప్పుకుంటూన్న ఖైదీల దేహాల్ని నులివెచ్చగా తాకుతున్నాయి. పశువులపై బాణప్రయోగంచేసి చివరకు అలసట చెంది కొంచెం విశ్రాంతి తీసుకునే కిరాతుని హస్తాలవలె ఘోర జ్ఞాపకాల్ని ఉత్పాదించే ఆ దారుణ ధ్వనులు ఆగిపోయినై. జైలు నౌకర్లు తాళాలు తీసి ఇనుప చువ్వల్ని ప్రక్కకు నెట్టుతున్నారు. అయిదు నిమిషాల తరువాత జైలు గంట మరొకమారు ధ్వనించింది. ఇక లేవండోయ్ అని భూమ్యాకాశాలు అదిరిపోయేలాగు అరుస్తూ పేము బెత్తాలు వూపుకుంటూ ఒక్కొక్క గదికి యిద్దరు ముగ్గురు పోలీసులు తయారైనారు. నిశాదేవి పైటకొంగుపై కష్టాలన్నీ మర్చిపోయిన మనసుతో నిర్విచారంగా విశ్రమించి రెండుగంటలసేపైనా కాలేదు. యీ పోలీసుల గాండ్రింపులకు ఖైదీలు దివ్యతపోధనాన్ని కోల్పోయి అధఃపతితులైన మునీశ్వరులవలె నిద్రాదేవి కరుణ హస్తాల్లోంచి జాగ్రదవస్థలోకి ఒక్క గంతుతో దూకటం జరిగింది. నిద్రమత్తు కండ్ల రెప్పల్ని నలిపివేస్తూండగా తూలిపోతూ పరమ దీనులై లేచి కూర్చున్నారు. నాలుగోవార్డు చివరి గదినుంచి ఇద్దరు ఖైదీలుమాత్రం బద్ధకంగా కూర్చున్నారు. ఒక ఖైదీ మరొకఖైదీతో నాలిక చప్పరిస్తూ యిలా అన్నాడు "ఇంకా విచారండేనికోయ్! యీచీకటి గదిలోనుంచి బయటపడే సుదినం రానేవచ్చింది కదా!"

తన విషాదవదనాన్ని ఒక్కతడవ బాధగా చూసుకుని ఆ రెండవఖైదీ యిలా జవాబిచ్చాడు. "దూరంగా ఆలోచించి చూస్తే నిజంగా ఇది నా జీవితంలో రెండో దుర్దినమేమో? నన్ను ఎంతో ప్రేమగా పెంచి పెద్దచేసిన వ్యక్తిని నాచేతుల్తో చంపినరోజు మొదటి దుర్దినం. నా జీవిత శేషాన్ని ఎదుర్కొనపోవు దుర్భరావమానాల్లో ఎలా నిలవగలగాలీ అనేప్రశ్న పెద్ద పులిలాగా నోరు తెరుచుకుని చూస్తూన్న యీరోజు రెండో దుర్దినం..." మోహన్ చాలాకాలంగా శ్రీ కృష్ణ జన్మస్థాన నివాసానికి అలవాటు పడ్డాడు. ఇది ఎన్నోతడవో అయిదు నిమిషాలపాటు లెఖ్ఖ పెట్టుకుంటేగాని అతనే చెప్పలేడు. "భాయీ, ఇటుచూడు. మానావమానాలు మానవుణ్ణి గడ్డు సమస్యలతోను మానసిక యాతనలతోను నింపేమాట నిజమే. అందుకనే వాటికి మనం బుద్ధిచెప్పాలిగాని మనకు అవి బుద్ధిచెప్పే స్థితివరకు పోకూడదని నా అభిప్రాయం..."

రెండుమూడు నిమిషాలనుంచీ గోడచాటున నిల్చుని యీప్రసంగాన్ని వింటూన్న జైలు వార్డెన్ కోపావేశంతో లోపలకు వచ్చి "ఎంత గొప్ప అభిప్రాయాలురా అబ్బాయ్! నీ ఉద్దేశాలు నీతిబోధలుగా చెలామణీ అయితే యీ ప్రపంచానికి ఆయుర్దాయం మూడినట్లే. లేరా! కూర్చుని కథలు చెప్తున్నావ్" అని అంటూ వాని వీపుపై ఒకతడవ హంటర్ ప్రయోగించాడు. మోహన్ హంటర్ దెబ్బతో బాధ కలిగించోటును ఒకచేత్తో రాచుకుంటూ లేచి నిలబడి వార్డెన్‌వంక కోపంగా చూస్తూ ముందుకు సాగి నడుస్తున్నాడు. ఇక వెనక లేచి నిలబడి ముందుకు వెళ్లనున్న మల్లేసువైపు చూచి వికటంగా నవ్వుతూ

"యీ గురుబోధల్ని ఆచరణలో పెట్టావంటే మళ్లీ మళ్లీ నీ దర్శనం మాకు తప్పదు. మా మాదరిగానే ఏదో ఒక వృత్తి చేసుకుని సుఖంగా యోగ్యతగా జీవించుకోక, పరిస్థితులకు అనవసరపు ప్రాధాన్యత లిచ్చి మూర్ఖత్వాలతో ఆవేశాలకు లోనై క్రూర కార్యాలకు పాల్పడిన ఫలితంగా యిక్కడకు వచ్చి, యీ హింస లన్నీ అనుభవిస్తూంటే నీలాంటి కొద్దో గొప్పో చదువుకున్న వాళ్ళను చూచి విచారంపడటంకంటే మేము చేయగలిందేమీ కనపడటం లేదు. త్వరగా కదులు. ఎనిమిదిన్నరకే నీ విడుదల" అన్నాడు వారెన్.

ఎనిమిదిన్నరకు అయిదు నిమిషాలు తక్కువ వుండగానే వాలుగొందల పదహారోనంబరు ఖైదీ మల్లేసును జైల్ నౌకరు వచ్చి ఇన్‌స్పెక్టర్ గారి గదిలోకి తీసుకువెళ్లాడు. మల్లేశ్ అధికారికి నమస్కరించి ఎదురుగా నిలబడ్డాడు. ఆ అయిదునిమిషాల్లోనూ అతని విడుదలకు సంబంధించిన కాగితాలు వ్రాయడం పూర్తయింది. గోడమీద గడియారం అరగంట కొట్టగానే 'నీవు వెళ్లవచ్చు. ఇకనైనా మంచిగా బ్రతుకు.' అన్నాడు ఇన్‌స్పెక్టర్. అలాగే అన్నట్టు బుఱ్ఱవూపి ఆయనకు శాల్యూట్ చేసి బయటకు వచ్చాడు మల్లేశ్. జైలు ప్రాకారందాటి గేటు ముందువున్న రాజబాటపై నిలబడి ఏదో ఆలోచిస్తున్నాడు. ఒక అరగంటసేపు ఆరకంగా గడిచింది ఏడుసంవత్సరాలకాలం కఠిన నిర్బంధబాధను అనుభవించినపిమ్మట స్వేచ్ఛ లభించిందికదా అనే ఆనందం అతనిముఖంలో ఎక్కడా ప్రస్ఫుటమవటం లేదు. ఎక్కడికి వెళ్ళాలో నిర్ణయించుకోకుండానే తల వంచుకుని ముందుకు నడుస్తున్నాడు. అంతకంతకు నిదాఘతాపం ఎక్కువవుతోంది. శరీరం స్వేదప్రవాహంతో నిండిపోయింది. ధోవతీ చొక్కా తడిముద్దలలాగా తయారయినాయి. కడుపులో మిక్కుటంగా ఆకలిబాధ కలుగుతోంది. దప్పిక గొంతుకను ఎండింపచేస్తోంది బలహీనపడ్డ ఆ పీలదేహం తూలిపోతూండగా మరి యిక ముందుకు నడవలేక సమీపంలో కన్పిస్తూన్న ఒక గ్రంథాలయభవనం దగ్గిరకు వెళ్ళాడు. ముందు వాలివున్న ఆ వసారాలో ఎవరూ లేరు. బాధగా కణతలు నొక్కుకుంటూ అక్కడ కూర్చున్నాడు. గతించిన జీవితకాలంలోని కొన్ని ముఖ్యఘట్టాలు అతని కండ్లముందు నృత్యం సల్పుతున్నాయి.

## 2

వెంకటేసు, మల్లేసు—వీరిరువురూ అన్నదమ్ములు. చిన్నవాడైన మల్లేసు శైశవదశలో వుండగానే తల్లిదండ్రు లిరువురూ గతించారు. వెంకటేసు ఎంతో ప్రేమతో తన తమ్ముణ్ణి పెంచి పెద్దవాణ్ణి చేశాడు ఉన్నత విద్యావంతుణ్ణిగా చేయాలని ప్రయత్నించాడు. కాని ఆ అదృష్టం మల్లేసుకు లేకపోయింది. ఎన్నితడవలు పట్టుదలగా ప్రయత్నించినప్పటికీ, మెట్రిక్యులేషన్ అతనిపాలిట ఎన్నటికీ దాటలేని ఒక అగాధజలధిగా తయారైంది. మల్లేశ్ నిస్పృహచెంది ఇక ఆజోలికే పోనన్నాడు. వెంకటేసు ఎంత ప్రోత్సాహపరిచినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. 'నేను యిటూ పనికిరాక అటూ పనికిరాక రెండింటాలా పాడైపోవటం జరుగుతుంది. నాకు చదువుమీద మనసు పోవటం లేదు. నేను వ్యవసాయంలోనే ప్రవేశించి నీకు అండగా వుంటాను. నీకప్పుడు కొంత శ్రమతగ్గుతుంది. వ్యవసాయికంగా మన యిద్దరి యొక్క కృషి కలిస్తే ఫలసాయంకూడా పెరుగుతుంది' అని అంటూ వాదించాడు మల్లేసు. చివరకు వెంకటేసు ఒప్పుకోక తప్పిందికాదు. మల్లేసు పొలంపని చేసుకోటం ప్రారంభించాడు. ఉన్నత విద్యావంతుడై సూటూబూటూ వేసుకుని తన తమ్ముడు ఎంతో దర్జాగా ఒక పెద్ద ఆఫీసరైవుండటం కళ్లారా చూడాలని ఎన్నివిధాలుగానో ఆశలు నింపుకున్న వెంకటేశ్, గడ్డపనులకాలంలో ఒళ్ళంతా నీరైపోతూండగా ఆయాసపడుతూ పలుగుతో తవ్వి గడ్డ విరవటం. వానాకాలంలో భోరుమని వర్షిస్తూండగా గంటలకొలదీ నడుమువొంచి మొక్క నాటటం మొదలైన శరీరశ్రమ ఎక్కువగా అవసరమైన యిటువంటిపనులలో పాల్గొంటూన్న మల్లేసును చూచి కంట తడిపెట్టుకునేవాడు. కొద్దికాలం గడిచినాక వ్యవసాయపుపనులకు సంబంధించిన కష్టమైనభాగాన్ని తానే నిర్వహించుకుంటూ ఏవేవో చిన్నచిన్న పనులుమాత్రం అతనికి ప్రత్యేకించాడు. ఒక సంవత్సరకాలం ఆ విధంగా గడిచింది. ఇంతలో ఆ గ్రామంలో దస్తావేజులు వ్రాసిపెడుతూ పొలాలు కొలిచిపెడుతూ మరి యితర ప్రయివేటుదారీ పను లన్నీకూడా నిర్వహిస్తూండే ఒకాయన మరణించటం జరిగింది. మళ్లా ఆ పనులకు తమ గ్రామంలోనివారినే ఒకర్ని నియమించాలని

నిర్ణయించుకున్నారు కొంతమంది భూస్వాములు. వారిదృష్టి మల్లేసుపైపడ్డది. తన తమ్ముడు యీ చెట్టు క్రింద ప్లీడరీవృత్తిలో ప్రవేశించడానికి వెంకటేసు ముందు ఒప్పుకోలేదు ఒకప్రక్కన ఆ భూస్వాముల ఒత్తిడీ మరోకప్రక్కన తనతమ్ముడు ఆ వృత్తిపె ఎక్కువమోజు కనపర్చడం—ఇందువలన వెంకటేసు అంగీకారసూచకంగా తలవూపటం జరిగింది. అందుకు తగినట్లుగా స్టాంపులవిక్రయానికి సంబంధించిన లైసెన్సు కూడా సంపాదించాడు. మల్లేస్ రెండు సంవత్సరాలలో మంచి ప్రఖ్యాతిగల ప్లీడర్ కాగలిగాడు. మరోక సంవత్సరానికి అతనిభార్య కాపురానికొచ్చింది.

మల్లేస్ భార్య వెంకులు కొంచెం స్వతంత్రేచ్ఛ కలిగినమనిషి. నగుకు బెదురూ లేకుండా తన మనసుకి నచ్చిన పనల్లా చేస్తూండటం, జంకూ గొంకూ లేకుండా తన నోటికివచ్చిన మాటనల్లా వాగుతూండటం—ఇటువంటి అలవాట్లను గమనించి వెంకుల్ని రెండు మూడు తడవలు కొంచెం గట్టిగా మందలించాడు వెంకటేసు. ఆ మందలింపును గొప్ప పరాభవంగా భావించి ఎన్నటికేనా తన బావగారిపై పగ తీర్చుకోవాలని సంకల్పించింది వెంకులు. అందుకై తగిన సమయంకోసం నిరీక్షిస్తూ తగిన పన్నుగడలకై అన్వేషణ జరుప ప్రారంభించింది. తోడుకోడలితో తగాదాకు దిగాలని ఎంత ప్రయత్నించినా ఫలించలేదు. కయ్యానికి కాలుదువ్వే వెంకులు తరహా చూసి ఆవిడ ముసిముసి నవ్వుల్తో 'నీకు ఇంకా చిన్నతనం వదల్లేదు వెంకులూ!' అని అంటూండేది. యీ భగీరథప్రయత్నంలో తనభర్తనే ఒక సాధనంగా వుపయోగించ గలగటం తప్పితే మరోమార్గం ఆమెకు తోచలేదు. ఆ మార్గంలోకూడా రెండుమూడు తడవలు విఫలురాలైంది. అయినప్పటికీ ఆమె నిరుత్సాహపడి నీరు కారలేదు. గుండెలో చెదిరిపోతూన్న ఉత్సాహాన్నంతా కూడదీసుకుని అధికమైన పట్టుదలతో ఒక దారుణాస్త్ర ప్రయోగానికి పూనుకుంది. ఒక రోజున లోపలి గదిలో ఏదో వ్రాసుకుంటూ కూర్చున్న తన భర్తదగ్గరకు వెళ్ళి మహానేర్పుగా ధోరణి ప్రారంభించింది.

"ఇట్లు దస్తావేజులు వ్రాసి పెట్టడం—అటు స్టాంపు లమ్మకం—ఇంకేం సంపాదన వేలల్లోనే వుంటుంది. కాని ఇంట్లో ఆడదానికి అణాడబ్బులు పెట్టి మల్లెపూలైనా తేవాలని వుండదుకదా?......"

"నువ్వన్నమాట వేలల్లో అక్కర్లా. వందల్లో వుంటేచాలు! అలాటికష్టం మనకెందుకులే అనుకున్నవారు ఏ పదిరూపాయలో ముట్టచెప్తూంటారు. ఆ వుద్దేశం లేనివారు రెండు మూడు గంటలసేపు చాకిరీ చేయించుకుని చేతులు జాడించుకుంటూ పోతారు. కొంతమంది వాళ్ళకు పండిన ధాన్యాలేవో కొద్దికొద్దిగా పంపిస్తూంటారు. గ్రామంలోని నలుగురు పెద్దలూ తెలివిగలవాడవనీ, సమర్థుడవనీ మెచ్చుకోవటం తప్ప అంతకుమించి ఒరిగేదేమీ నాకు కన్పించటం లేదు."

"నిమిషమైనా తీరికలేకుండా ఎప్పుడూ యీ పనుల్లోనే తిరుగుతూంటారాయె! తగిన సంపాదన లేనిదే యీ శ్రమంతా మనకెందుకండీ?"

"ఏదో కొంతసంపాదన వుంటుందనుకో, రైత్వారీ గ్రామాల్లో యిటువంటి వృత్తులకు సంబంధించిన వాళ్లు డబ్బుద్వారా రాబట్టుకోటం కష్టమే"

"డబ్బు కాకపోతేమాత్రం ఇతరత్రా మాత్రం ఏమి వస్తున్నయ్యంటారు?"

"ఏ పంటరోజుల్లో ఆ పంటధాన్యం ఎవరికి తోచినంతవారు మన ఇంటికి పంపిస్తూనే వున్నారు కదా?"

కనుబొమ్మల్ని విలాసంగా కదుల్చుతూ ఎదుటివాడి గుండెల్లో తన మాటలు నాటుకో గల ఆకర్షణతో ఇలా అన్నది వెంకులు. "అట్లాగండీ! నా మొగుడు సంపాదించినదానిని నాకు చూపించక పోతే చూపించకపోయె! యీ విధంగా మఱిదివల్ల రాబడి వున్నదే చెల్లీ అని నాతో ఆవిడగారు ఒక్క ముక్క అయినా అన్నదికాదే! అంతవరకెందుకండీ? ముష్టి మల్లెపూల విషయంలో చూడకూడదండీ? మఱిది, తోడుకోడలు మనుష్యులన్న భావన ఆవిడకు యింత వరకూ లేదనుకోండి. కనీసం ముత్తయిదుపిల్ల యింట్లో వున్నదికదా అనే కొద్ది సద్భావమైనా చూపకూడదండీ? మొగుడు బజార్నించి తెచ్చిన మల్లెపూల పొట్లం ముందు పెట్టుకొని దండలు గుచ్చి తన సిగకు మాత్రం అలంకరించుకుని కూర్చుంటుందా?"

"అంత దురుసుతనంగా ప్రవర్తిస్తోందా మా వదినె?"

"నెమ్మదిగా అంటారేమిటి? ఆవిడ మాట అలా వుంచండి. ఆయన తతంగాన్ని అసలు మీరు అర్థం

చేసుకున్నారా? యీ రాతకోతల చాకిరీవల్ల మనకేమీ సంపాదన లేదని మీరే అంటున్నారు కదా? అసలు భూదేవిని నమ్మి మోస పోవటమంటూ వుంటుందా? వ్యవసాయం జోలికి మిమ్మల్ని రానివ్వకుండా పొలం పనులు మీకు అబ్బకుండా చేసి వూళ్ళో నలుగుర్నీ ఆశ్రయించి వారిచేత మీకు నచ్చచెప్పించి మీకీ చెట్టు కింద ప్లీడరీవృత్తి అంటగట్టిన మీ అన్నగారి పన్నుగడ రవ్వంతయినా మీరు గ్రహించారా చెప్పండి."

"ఇందులో పన్నుగడ ఏముంటుంది? ఒకరు ఆ వృత్తి, మరొకరు ఇంకొక వృత్తీ చేసుకుంటే ఆదాయం ఎక్కువ వుంటుందనే అభిప్రాయమై ఉండాలనుకుంటాను."

"అట్లాగా? మన తెలివితేటలు ఇంత తక్కువ ఎత్తులో విహరిస్తుండబట్టే మనల్నితర్లు శ్రమ పడకుండా కూడా బోల్తా కొట్టించగలుగుతున్నారు. అసలు కీలక మున్నదియ్యా స్వామీ! పెద్ద కీలకమే వున్నది. మా నాన్న ఎన్నటినుంచో మొత్తుకుంటున్నాడు. ఇక చెపా వినండి. వ్యవసాయం మన కులదేవత. నాగలీ, బండీ గున్నలు మనకు అన్నంపెట్టే దాతలు. అటువంటప్పుడు వాటికి మిమ్మల్ని మీ అన్నగారు సదభిప్రాయముతోనే దూరము చేస్తున్నారని నమ్ముతున్నారా? యీ నాలుగెకరాల వల్ల నెలపినా తనొక్కడే ఆధిపత్యం అట్టిపెట్టుకోవాలనే తప్ప మరేమీ కాదు. ఇప్పటికైనా గ్రహించండి" మల్లేస మరి ఒక మాట్లాడలేదు. అతనిమౌనాన్ని ఆమె అర్థాంగీకారంగా భావించి ఆనాటినుండి ప్రతి రోజూ మల్లేసుకు తీరికున్నపుడల్లా దగర కూర్చుని తన తోడికోడలు బావగార్లపైన అనేక చాడీలు చెప్తాండేది.

కొంతకాలం గడిచిన తదుపరి వాటి ప్రభావం మల్లేసు మనసుపై బాగానే పనిచేసింది. చివరకొక రోజున గ్రామ పెద్దల్నందర్నీ సమావేశపరచి పంపిణీ జరిగి తీరాల్సిందేనని పట్టుపట్టాడు. "మన ఇద్దరిలో ఎవరికీ యింతవరకూ పిల్లాజల్లా లేరుకదా? మనలో ఎవరికో ఒకరికి సంతానం కలిగేటంతవరకు యీ విషయాన్ని గురించి ఆలోచించటం అనవసర మనుకుంటాను. ఇప్పుడే అవసరమని నువ్వు భావించే పక్షంలో నాకేమీ అభ్యంతరం లేదు. ఏమైనప్పటికీ చాలా ఆలోచించి చేయవలసిన పని. అందుకుగాను పదిరోజులు వ్యవధి వుంచుకోవటం మంచిది. ఈలోగా నువు మనసులో బాగా చర్చించుకున్న తదుపరి నీ అభిప్రాయం తెలియచెయ్" అన్నాడు వెంకటేసు విషాదవదనంతో.

మల్లేసు అంగీకరించి ఇంటికి వెళ్ళాడు. భార్యతో విషయాన్ని వివరించి చెప్పాడు. "చూచారా! ఆయన దొంగయెత్తు! మిమ్మల్ని వదలడానికి ఆయన ఇష్టపడటం లేదు. ఏముందండీ! మీరు వేరుపడటంతో ఆయన్నించి ఒక బంగారుకొంప ఎగిరిపోయినట్టే కదా!" అన్నది వెంకులు. ఇటువంటి మాటలే చెపుతూ ఆ పది దినాల వ్యవధిలోను భాగం పంపిణీ కావాలనే దృఢ నిర్ణయాన్నుండి అతన్ని మరలనివ్వకుండా, అతనిదీక్ష ఏమాత్రం సడలనివ్వకుండా కృషిచేసింది. వ్యవధితీరిన మరుసటి దినాన గ్రామ పెద్దలందర్నీ మల్లేసు సమావేశపర్చి 'నేను బాగా ఆలోచించుకున్నాను. ఈనిర్ణయం చాలా మంచిదనే నేనుభావిస్తున్నాను' అనిచెప్పాడు. పంపిణీ కార్యక్రమం ఒకగంటలో పూర్తయింది. ఫారీకత్ దస్తావేజు కూడా వ్రాసుకున్నారు. చివర్లో వెంకటేసు తన తమ్ముడివంతుకు ప్రత్యేకంగా రెండు వేల రూపాయల్ని మిగులుచూపి ఆ రొఖ్ఖం అతని చేతిలో వుంచినపుడు అందరూ ఆశ్చర్యపడ్డారు. 'ఇంత డబ్బు నేనెపుడు సంపాదించాను అన్నయ్యా!' అన్నాడు విస్మయంగా మల్లేసు. అది నీ కష్టార్జితం తమ్ముడూ! నీకొరకై యింట్లో యితరులు అప్పచెప్పిన గడ్డిపోచ దగ్గర్నుంచీ ప్రతిదానికీ విలువకట్టి నీపేర యీ మొత్తాన్ని నిలవచేసి వుంచాను" అన్నాడు వెంకటేసు. ఇది ఒక అద్భుతకార్యంగా పరిగణించుకుని నలుగురు పెద్దలూ వెంకటేస్ సౌశీల్యాన్ని వేనోళ్ల పొగడుతూండగా వెంకులుమాత్రం "అసలు యింతకు పదిరెట్లుగా మా సంపాదన ఆయనవద్దకు చేరివుండబట్టే యీమాత్రం తొంటిచేతిని బయటకు చూపాడు" అని అంటూ వ్యాఖ్యానించింది ఆ తదుపరి వెంకులు కక్షగా ప్రవర్తిస్తూన్నప్పటికీ ఆ అన్నదమ్ములిరువురూ పరస్పరం సహకారంగాను ఐకమత్యంగాను వుంటూనే వచ్చారు.

## 3

సహజంగా వెంకటేసుది దయార్ద్రహృదయము. ఇతరులను త్వరితంగా ఆకర్షించగల వెంకటేస్ లోని కొన్ని ఉత్తమలక్షణాలు అతని వ్యక్తిత్వాన్ని మెరుగుపెట్టే ద్రావకాలుగా వుపయోగపడుతూంటాయి. భూలోక భోగ్యతయాలైన ఉన్నతి, ధనం, అధికారం

ఈ మూడింటికొరకు మానవుడు నిరంతరము తపన పడుతూంటాడు. యోగ్యత లేనిదే ఉన్నతి పందుకోలేమనీ, అదృష్టం వరించనిదే ధనప్రాప్తి ఉండదనీ, సమర్థతాశూన్యత అధికార ప్రాభవానికి బద్ధశత్రువనీ వెంకటేష్ భావన. ఆయా అర్హతలు కూర్చుకున్న తదుపరి మానవుడు సలిపే స్వల్పకృషితోనే సఫలమనోరథుడు కాగలడని అతని ఆత్మవిశ్వాసం. అతని అమంచితనంవల్లనే తమ సమస్యల్ని గూర్చి అతని సలహాలను పొందగోరి అతనివద్దకు కొంతమంది వస్తూవుంటారు. ఫలానా మనిషి దుర్మార్గుడని ఖండనగా నిర్ణయం చేసుకోవడంలో తొందరపాటు ప్రదర్శించే కోవకు చెందినవాడు కాడు వెంకటేష్. అందువల్లనే మల్లేస్ తనపై ఎన్నో దూషణవాక్యాలను విసురుతున్నాడని ఎంతోమందివల్ల వినివుండీకూడా వెంకటేష్ తన హృదయంలో తన తమ్మునికిగల వాత్సల్యస్థానాన్ని వీసంపాలైనా చెరపడానికి ఇష్టపడలేదు. తనవద్దకు ఏవేవో వ్యవహారాలను గూర్చి సలహాలకొరకు వచ్చినవారిని తన తమ్ముడు లౌకికవ్యవహారజ్ఞానం కలవాడు కదా అని మల్లేస్ దగ్గరకు పంపగా అతను తేలికగా సమసిపోగల ఆ సమస్యలకు జటిలస్వరూపములు తొడిగి, దావాలలోకి దింపి కోర్టులచుట్టూ తిప్పి ఎంతో డబ్బు గుంజుకుని వారిని ఎన్నోవిధాల ధ్వంసం చేసినపుడు కూడా వెంకటేష్ తనలో తాను పరితపించాడే కాని మల్లేస్‌నేమీ దూషించలేదు.

అయితే సూరమ్మ వ్యవహార విషయంలో మాత్రం వెంకటేష్ మౌనంగా వుండలేకపోయాడు. మల్లేసు మేడప్రక్కనే సూరమ్మ ఇల్లు. ఆవిడను ఒకమాదిరి భాగ్యవంతురాలుగానే పేర్కొనవచ్చు. ప్రస్తుత ధరల ప్రకారం విలువకడితే ఆమె ఆస్తి రెండు లక్షలకు ఏవిధంగాను తక్కదు. ఆవిడకు సంతానంలేదు. దగ్గర వుండే ఇతర బంధువులుకూడా ఎవరూ లేరు. ఆ పెంకుటి భవంతిలో ఏకాకిగా జీవితాన్ని గడుపుకుంటూ భూములమీద వచ్చిన ఫలసాయాన్ని దానధర్మాలకు వినియోగిస్తూ, ఆ గ్రామంలోని కొన్ని శిథిల ధర్మసంస్థలు తమ జీర్ణస్థితిని తొలగించుకోగలిగి సౌందర్యవిలసితంగా రూపురేఖల్ని దిద్దుకుని ప్రజోపకారంగా వుపయోగపడేటందుకు కారకురాలవుతూ వచ్చిన ఔదార్యవంతురాలు సూరమ్మ. కొంతకాలానికి మల్లేసు విషదృష్టి ఆమెపై వాలింది. ఒకనాటి రాత్రి మేడమీద కూర్చుని ధనసంపాదనా మార్గాలనుగురించి తీవ్రంగా ఆలోచిస్తూన్నపుడు అతని మనసులో 'కష్టపడి సంపాదించి ఎవడూ పెద్ద ఆస్తుల్ని కూర్చలేడు. అక్రమంగానో సక్రమంగానో ఇతరుల ఆస్తిని సంక్రమింప చేసుకోవటమే అందుకు తగిన ముఖ్యమార్గం' అని ఒక భావన దొర్లింది.

ఆ మర్నాడు సూరమ్మ జిలాకలెక్టరుకు దరఖాస్తు వ్రాసిపెట్టమని మల్లేస్ దగ్గరకు వచ్చింది. 'కలెక్టరు దొరవారికి పంపే దరఖాస్తులు మామూలు కాగితాలపైన వ్రాయకూడదు. స్టాంపులు వుపయోగించాలి. వ్రాసే ముందు పీడరుతో ఆలోచించటం కూడా మంచిది. నేను రేపు గుంటూరు వెళ్ళవలసి వుంది. పీడరుగారితో కూడా సంప్రదించి దరఖాస్తు పూర్తిచేసి నేనే స్వయంగా కలెక్టరుగారికి యిచ్చివస్తాను' అని చెప్పి నాలుగు దస్తావేజుల పైన ఆవిడ చేతివ్రేలి ముద్రలు వేయించాడు మల్లేస్. ఆవిడ చదువుకున్నది కాకపోయినప్పటికీ కొంత లోకజ్ఞానం లేకపోలేదు. కాని ఏ విషయాన్ని గురించయినా కుటిలంగా ఆలోచించటం ఆమె వల్లకాదు. ఆ కారణం చేతనే మల్లేస్ చేసిన యీ పనిలోని అంతర్యాన్ని ఆమె గ్రహించలేకపోయింది. ఆ తర్వాత రెండు మాసాలకు, తనకు విక్రయించుటకు ఒప్పుకున్న విక్రయాస్తి ఖరీదులోని మూడున్నరవంతుల పైకము దస్తావేజులు వ్రాయించి యిచ్చిన రోజునే పొందికూడా రిజిస్ట్రేషనుకు ఎన్ని తడవలు పిలిచినా రానందున శేషించిన ధనమును బ్యాంకులో డిపాజిట్ చేసి దస్తావేజు రిజిష్టరు చేయించుకునే ఏర్పాట్లకు పూనుకోబోతున్నానంటూ ఒక నోటీస్ ఇచ్చాడు మల్లేసు సూరమ్మకు. ఆ నోటీసు చదివించడానికి సూరమ్మ వెంకటేసు కడకు వచ్చింది. ఆ నోటీసంతా పూర్తిగా చదివి చూసుకుని అత్యంతాశ్చర్యంగా అడిగాడు వెంకటేశ్. "మావాడికి నువ్వు పదమూడెకరాల పొలం అమ్మేవా సూరమ్మ పిన్నీ?" "అదేమిటి నాయనా! నేనేమీ ఎరుగనే" అన్నది సూరమ్మ. ఆ వెంటనే నోటీసులోని విషయాలను వెంకటేష్ బిగ్గరగా చదివి వినిపించాడు. నోటీసులోని ఘోరమైన అసత్యాలన్నిటినీ విని సూరమ్మ మూర్ఛిల్లింది. గ్రామంలోని పెద్దలందరూ చేరారు. విషయాన్ని సావధానంగా విని చాలా పరితపించారు. మల్లేసు కుటిల స్వభావం జగమెరిగినదే! ఎవరికీ తెలియనిదేమీ కాదు. ఇదివరకు నలుగురైదుగుర్ని మోసపుచ్చాడు. ఇప్పుడు అది చాలా భారీ ఎత్తులో జరిగింది. యీతడవ మాత్రం మల్లేసుకు తగిన ప్రాయశ్చిత్తం చేసి తీరవల్సిందే నన్నారు గ్రామపెద్దలు. యీ సర్పాన్ని యికమీదట పాలుపోసి పెంచటం మంచిది కాదు. కనపడిన వాడినల్లా కాటువేసి గ్రామ వినాశనం జరిపే ప్రమాదమున్నది గనుక లేతలోనే దాని పడగను చితకకొట్టడం అవసరమన్నారు. యీ దురంతాన్ని హర్షించి వూరుకోడానికి వీల్లేదని పట్టుపట్టారు. సూరమ్మకు జరిగిన యీ ద్రోహం తమలో ప్రతిఒక్కరికీ జరిగినట్లుగా భావించుకుని యీ అకా

ర్యాన్ని తుదముట్టించాలని ప్రతిజ్ఞగా మాట్లాడారు. వెంకటేస్ మనసుకూడా చాలా బాధపడింది. మల్లేస్ పాలిట పతనకాలం దాపురించబోతున్నది కాబట్టే నూరమ్మవంటి మహాదాతను, పవిత్రజీవికి ద్రోహం సలుప బూనుకున్నాడని దుఃఖించారు. ఈ సందర్భంలో తగిన కార్యక్రమాన్ని నిర్ణయించేందుకు అందరూ వెంకటేస్ వైపు కళ్లు పెట్టుకుని చూస్తున్నారు. 'వెంకటేసూ! నువ్వు గనక యీ విషయంలో కలగజేసికొనకపోతే నూరమ్మ మునిగిపోయినట్టే.' అని చుట్టూవున్న పెద్దల్నించి వినిపిస్తూన్న మాటలు సత్వగుణశోభితమైన అతని హృదయాన్ని సవాలు చేస్తున్నయ్. లోకానికి ఉపయోగింపని మంచితనం అడవిలో వికసించిన గులాబీ పుష్పంమాదిరి వ్యర్థప్రయోజనం కలదేకదా! మల్లేస్‌తో నీకు రక్తస్పర్శ వుండవచ్చు. కాని అతనిలోని అల్పత్వం. అత్యాశ, నిరంకుశత్వం, దగాకోరుతనం — వీటిలో మాత్రం నీకు ఏ విధాన చుట్టరికంలేదు. పైగా నీకవి బద్ధశత్రువులు కూడాను. అందుచేత లేచి నిలబడు! అని అంటూ ఆత్మ ప్రబోధింప మొదలిడింది. ఇంతలో నూరమ్మ గుండెలు బాదుకుంటూ వెంకటేస్ పాదాలపైపడి ఏడవటం ప్రారంభించింది. భూమ్యాకాశాలు కదలిపోతున్నట్టనిపించింది. అతనిలోని ప్రతి రక్తాణువూ రోషావేశంలో కంపించిపోతోంది. అతని ముఖబింబం ఒక్కసారిగా నూతన తేజంతో ప్రకాశించింది. వాక్కులో పటుత్వం ప్రబలమవుతూండగా కొంచెం ఒంగి పాదాలమీది నూరమ్మను పైకి లేవతీస్తూ వెంకటేస్ ఇలా అన్నాడు: "లేచి నిలబడు పిన్నీ. ఇక నీవు భయపడవలసిన పనిలేదు. యీ దుర్మార్గాన్ని తప్పకుండా ఎదుర్కొని తీరుతాను. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆగేదిలేదు." నూరమ్మ చేతులు జోడించి నమస్కరిస్తూ ఇంటికి వెళ్లింది. ఆ మర్నాడు వెంకటేస్ తన తమ్ముణ్ణి కబురంపి పిలిపించాడు. తుమ్మలచెరువు గట్టుమీద వేపచెట్టు నీడన కూర్చోపెట్టుకొని చేసిన తప్పును సరిదిద్దుకోవలసిందని ఎంతో బుజగింపుగా బోధించాడు. మల్లేస్ తన మూర్ఖత్వాన్ని విడిచాడుకాదు. చివరకు తన ప్రయత్నం విఫలమైందనే నిస్పృహలో లేచి నిలబడాడు వెంకటేసు. మల్లేసు కూడా చొక్కా దులుపుకుంటూ లేచి నిలబడి అంతంలేని ఉక్రోషంతో ఇలా అన్నాడు. "నువు ఎన్నటికైనా నా అభివృద్ధిని మంట కలపదల్చుకున్న అసూయాపరుడవని నాభార్య చెప్తూనే వచ్చింది. ఆ మాటను నమ్మేనుకాను. ఇప్పుడు ప్రత్యక్ష నిదర్శనంగా చూపి ఆ పరమ సత్యాన్ని లక్ష్మీస్వరూపిణిఅయిన ఈ వేపచెట్టు అనుగ్రహించింది."

దీర్ఘప్రయాణంలో అలసిసొలసి దుర్బలుడై పడమటికొండ చాటున ఒరిగిపోతూన్న సూర్యభగవానుడి వేపు నిశ్చలంగా దృష్టిబఱపి ఇలా అన్నాడు వెంకటేస్.

"నా తమ్ముడు గొప్ప విద్యావంతుడు కావాలనీ వ్యవహారదక్షతతో రాణింపు పొంది కీర్తికుసుమాలతో పూజింపబడాలనీ నేను చేసిన కృషిఅంతా బూడిదలో పోసిన పన్నీరుమాదిరి వ్యర్థమైపోయి చివరకు ఒక అజ్ఞానవతిఅయిన స్త్రీయొక్క వెఱ్ఱి వుపదేశాలకు దాసోహమై పోగలడని నేను స్వప్నంలోనైనా భావింపలేను. మల్లేస్, ఒక్కమాట చెప్తున్నాను. శ్రద్ధగా ఆలకించు. నన్ను ఎన్ని దుర్భాషలాడినా వాటిని ప్రేమ వాక్యాలుగానే ఎంచుకుంటాను. అమాయకులకు దారుణద్రోహాలు జరుగుతూన్నపుడు మాత్రం నాలో రక్తం దాని విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చుకుని తీరుతుంది సుమా!"

వెంకటేస్ బోధలు మల్లేస్ మనసును ఏవిధంగానూ మార్చలేకపోయినయ్. అతడు ముందు నిర్ణయించుకున్న పద్ధతి ప్రకారం నూరమ్మమీద దావా చేశాడు. నూరమ్మ తనకు కోర్టువారినుండి వచ్చిన సమను తీసుకునివచ్చి వెంకటేస్ చేతిలోవుంచి 'ఏమో నాయనా, ఏం చేస్తావో నీదయ." అన్నది. వెంకటేస్ సమన్లు చదువుకున్నాడు. నూరమ్మ అతనివంక దీనంగా చూసింది అతని మనసు ఘోరంగా గురపిలుతోంది. నేత్రాలనుండి రెండు నీటిబొట్లు రాలూండగా ఇలా అన్నాడు. "నేను నీకు వాగ్దానం చేసివున్నాను కదా పిన్నీ. ఆ తప్పుడు దస్తావేజును చిత్తుకాగితం మాదిరి విలువలేకుండా చేయించడానికి నా శాయశక్తులా పాట్లుపడతాను. నా గుండెలో ఏనాడో నెలకొని ఎంతో వాత్సల్యాన్ని సహనాన్ని ఆహారంగా పొందుతూన్న 'నా తమ్ముడు' అనే పదంలోని 'నా' అనే అక్షరాన్ని తుడిచేసుకోగల్గితేగాని యీ పని సాధ్యంకాదు."

ఒక సంవత్సరం గడిచిన తదుపరి ఆ దావా మునిసిఫ్‌కోర్టులో విచారణకు వచ్చింది. తీర్పు విని గ్రామస్థులు నిర్ఘాంతపోయినారు. నూరమ్మ దిగులుతో కుంగిపోయింది. మల్లేసు, యీ సందర్భంలో అతనికి అండగా నిల్చిన నల్గురు గ్రామస్తులూ హర్షధ్వానాలతో విజయోత్సవం సల్పుకుంటూ వెంకటేసును అతని వైపువారినీ హేళనగా మాటాడుతున్నారు. కాని వెంకటేస్ మాత్రం కించిత్‌మాత్రంగానైనా నిరుత్సాహపడలేదు. 'ధర్మదేవత నియమబద్ధంగా నడవటానికి యిదేమీ రామరాజ్యపు కాలం కాదుగదా!' అని అంటూ నాలుక చప్పరించి వూరుకుని నూరమ్మచేత పైకోర్టులో అపీల్ చేయించాడు. నాలుగు మాసాలు గడిచిన తదుపరి పైకోర్టు నిర్ణయంకూడా నూరమ్మకు వ్యతిరేకంగానే వచ్చింది. దావా ఖర్చులు, రెండు సంవత్సరాల ఫలసాయపు విలువ, ఇదంతా కలిపి పదివేల రూపాయలవరకు నూరమ్మ మల్లేసుకు చెల్లింపవలసి

వచ్చింది. ఆ మొత్తం కోర్టులో చెల్లించిన తదుపరి హైకోర్టుకు పోదామన్నాడు వెంకటేసు. యీ సందర్భంలో ఇక ముందుకు సాగిపోవటం సూరమ్మకు ఇష్టం లేదు. యీ అపజయాలతో నిరుత్సాహినియై యీవిషయాన్ని ముగించుకుని వూరుకుందామనుకుంది. కాని వెంకటేస్ మాటను కాదనలేక హైకోర్టులో అపీల్ చేసింది. కాని హైకోర్టు న్యాయమూర్తుల హృదయాలుకూడా సూరమ్మను వెంకటేస్‌ను చిన్న చూపే చూసినయ్. మలేస్ అదృష్టదేవత అందిచ్చిన మధుపాత్రను నోటి ముంగుంచుకుని మదించిన మనసును అదుపులో వుంచుకోలేక ఇష్టం వచ్చినట్లా అందరితోను, వాగటం ప్రారంభించాడు. వెంకటేశ్ మాత్రం ఇదివరకటి ఉత్తేజంతో నే సూరమ్మతో "చూడబోతే, మన దేశంలో సుప్రీమ్ కోర్టు వున్నదని వీళ్ళకు తెలియనట్లే వుంది" అన్నాడు. "ఇక వద్దు నాయనా, యీ వ్యవహారాన్ని మర్చిపోదాం. యీ అపజయాలతో ఇప్పటికే నేను చాలా అలిసిపోయాను. బోలెడు డబ్బు దండగైపోయింది. యిక మొండిపట్టుగా పూనుకుంటే యీ మిగిలిన ఆస్తికి కూడా ఆశవదులుకోవల్సి వస్తుందేమో?" అన్నది సూరమ్మ.

"అలా వీల్లేదు పిన్నీ! మనకు అంగుబాటులో ఉన్నంతవరకూ న్యాయశాస్త్రాన్ని 'నువు మాయారూపంలో వ్యవహరిస్తూ మాకు యీ ద్రోహం ఎందుకు జరగనిచ్చావ్?' అని నిగ్గతీసి అడిగి తీరవలసిందే. నువ్వేమీ ధనవ్యయమని వెనకాడనక్కరా. నా రెండెకరాల నల్ల నేల, ఇలూ అమ్మి ఢిల్లీచుట్టూ తిరుగుతాను. ఈ ధర్మయజ్ఞపు హోమగుండంలో నా సర్వస్వాన్నీ నన్నూ కూడా దగ్ధం చేసికోవల్సాను." అన్నాడు వెంకటేస్. "అంతపని మాత్రం వద్దు నాయనా. నాకోసం యిప్పటికే ఎంతో శ్రమపడ్డావ్. నీ యిష్టప్రకారంగా నే మళ్ళీ అపీలు చేద్దాం." అన్నది సూరమ్మ. వెంకటేస్ ఢిల్లీ వెళ్ళి సుప్రీంకోర్టులో అప్పీలు చేసి వచ్చాడు. గ్రామంలో తల ఎత్తుకుని తిరగడానికి వీలు లేకుండా మల్లేస్ ముఠా వలన అతను అనేక విధాలుగా అవమానపడుతున్నాడు. ఆ ఉన్నత న్యాయస్థాన వాణికూడా యీ అధర్మాన్ని హర్షింపలేక పోవచ్చునేమో అను ఒక చిన్న ఆశతో తీర్పుకోరకు అతను నిరీక్షిస్తున్నాడు. మూడుమాసాలు గడిచిన తదుపరి సుప్రీంకోర్టునుండి వచ్చిన ఒక టెలిగ్రాం అతని ఆశను ఫలింపచేసింది. ధర్మానికీ అధర్మానికీగల తేడా వివరించి చెప్పింది. యీ వార్త ఒక్క నిమిష కాలంలో వూరంతా పాకిపోయింది. సూరమ్మ వేపు కృషిచేసిన వారందరూ విజయావేశంతో వుప్పొంగిపోతూ వెంకటేశ్ యింటిచుట్టూ మూగేరు. 'ధర్మాత్ముడు వెంకటేస్‌కి జై' అనే కీర్తినాదాలు మిన్నుముట్టుతున్నాయి. యీవిషయం మలేస్‌కు తెలియడానికి ఎంతో సేపు పట్టలేదు. అత్యంత కోపావేశంతో వూగిపోతున్నాడు. ఆ పరిసితిచూచి అతని భార్య వెంకులు యిలా అన్నది "నేను మీకు అపుడు చెప్పలేదండీ! మొదట్లో నెత్తిమీద మొట్టికాయ వేసి ఆయన్ని అణిచిపెట్టి వుంచండీ అని! ఎన్నికలో పోటీచెయ్యకండీ అని నెత్తిమీద నోరుపెట్టుకుని మొత్తుకున్నా కూడా మీరు విన్నారా? వూరికి కాలు అడ్డం పెట్టే వాడుకూడా లేకుండా దమ్మిడీ ఖర్చు లేకుండా హాయిగా పంచాయితీ బోర్డు ప్రెసిడెంటయి కూర్చున్నాడు. ఆహోదాతో బోలెడు పరపతి సంపాదించి వూళ్ళో వాళ్ళందర్నీ కట్టుకుని మననెత్తిమీద దీపం పెట్టాడు."

"పిచ్చివానా! పదవి తర్వాత పరపతి వుండదు. పరపతే పదవి నిస్తుంది. పదవీ స్వీకరణ పరపతిని నశింపచేసే విషమాస్త్రం."

"మరి ఆయనకు వూళ్ళో యింతమంది మద్దతుగా వుండటానికి కారణం ఏమిటంటారు?"

"ఆయనలోని మంచితనంకూడా కొంత కారణమైవుండవచ్చు. మన కపకారం చేసినవాడల్లా మంచివాడు కాదనే అభిప్రాయం సరైనది కాదు. రోషం, శౌర్యం అపమార్గాన నడవకుండావుంటే మానవుడి మంచితనానికి అవి అలంకారభూషణాలు. ఆయన ఎంతమంచివాడైనా కానియ్! నాకు అపకారి, నా తలను తుంచివేసిన యీ ఘోర శత్రువును ఒదిలిపెట్టను."

"ఒదిలిపెట్టక మీరు చేయగల్గిందేమిటి?"

"చూద్దువు గాని"

మల్లేస్ చరచరా నడుస్తూ గదిలోకి వెళ్ళాడు. అస్థిమితమైన అతని మనసులో గుబులు రేగుతోంది. ఆకాశానికి ఎత్తిన యీ విజయ పరంపరలు అంతెత్తునుంచీ అతన్ని ఒక్క వాటుగా నేలమీదప విసిరినై. ప్రచండ వాయువేగంతో అనేక వేల భావనలు అతని మనసులో పరుగులు తీస్తున్నయ్. దేనినీ సాకల్యంగా తెరిచి చూడగల ఓపిక అతని మనసుకు లోపించింది. గుబులు గుబులుగా అటూ ఇటూ పరికిస్తూండగా ఎదురుగా గోడమీద మేకునుంచి వ్రేలాడుతూన్న ఒక వస్తువు కన్పించింది. అది కత్తి! ధవళంగా నిగనిగలాడుతూ మెరిసిపోతున్నది. ఆ వస్తువు 'కొంతమందికి నేను భయంకరంగా కన్పించినప్పటికీ, నన్ను ఆప్తమిత్రుడుగా ఎంచి ఆత్మ సంతృప్తిని పొందగలిగే వాళ్లు కూడా లేకపోలేదు.' అని చెప్తున్నట్టుగా తోచింది. మల్లేస్ దృష్టికి ఆ వస్తువు కేంద్రీకృతమైంది అతని

ఆలోచనలన్నీ దానికిచుట్టూ విహరిస్తున్నయ్. ఆలోచనల ఒత్తిడికి తట్టుకోగలకొద్దీ అతని మనసుకి గట్టిబలం కలిగింది.

“అనవసరపు ఆలోచనలతో కాలం వ్యర్థపుచ్చకుండా నన్ను ఉపయోగించడమే నీ కర్తవ్యం! మరి ఎన్నటికీ అతనివలన యిలాంటి గడ్డుసమస్యలు తిరిగి సముత్పన్నము కాకుండా నిన్ను నీవు కాపాడుకోవాలనుకుంటే నన్ను అతనిమీదకు ప్రయోగించు. మీ మీ బాంధవ్యాలతో నాకేమీ పనిలేదు. ఎవడి చేతిలో కూర్చుంటే వాడు చెప్పినట్లు చేయటమే నా విధి. ఆలోచన వాడిది. కార్యాచరణ నాది.” అని ఆ కత్తి అన్నట్లు తోచింది అతనికి!

ఇందాకటినుంచీ ఊహాజనిత లోకంలో విహరిస్తూండిన మల్లేసును వాస్తవికత, బందాలేసి యీ లోకంలోకి లాగింది. ‘కాలయాపన కూడదు, అనుకున్నపని వెంటనే జరిగితీరాలి’ అని నిశ్చయించుకుని గోడదగ్గరకు వెళ్ళాడు మల్లేస. ఆ వస్తువుపై హస్తాన్ని వుంచినపుడు కూడా అతని మనసు కొంచెం ఆలోచింప మొదలిడింది. కాని అవమాన వ్యథతో వుడికిపోతూన్న అతని రక్తం ‘కాలయాపన చేయవద్దు. ఆలోచనలకు నీతిలేదు. అవి మనిషిని ఎటు పడితే అటు లాగుతూంటాయి’ అని హెచ్చరించింది. వెంటనే ఆ వస్తువుతీసి ఒక పొడుగాటి లెదర్ బేగ్‌లో వుంచాడు. ఆ లెదర్ బేగ్ ని బొడ్డుదగ్గర బట్టముడిలో దాచుకుని మేడమెట్లు దిగి బయటకు వెళ్ళిపోయాడు. అప్పటికి చాలాసేపు కావటం మూలాన వెంకటేస్ ఇంటివద్ద జనసందడి కొంచెం తగ్గింది. వీధిమధ్యంలో నిలబడి అపుడే వచ్చిన అయిదారుగురు పెద్దలతో మాట్లాడుతున్నాడు వెంకటేస్. ఏ దిక్కునుంచి వచ్చాడో కూడా ఎవరూ గమనించలేదు. విద్యుత్ ఆవేశంతో వెంకటేస్ మీద కురికి రెండు కత్తిపోట్లు వేసేవరకూ ఆ అయిదారుగురూ యిది హత్యాప్రమాదమని అవగాహన చేసికోలేకపోయారు. వారికి కాళ్ళాడలేదు. మనసులు పనిచేయలేదు. కండ్లముందు జరుగుతూన్న దురంతం గుండెల్ని తీవ్రంగా కంపింపచేస్తోంది. హంతకుడు వెంకటేస్ శరీరాన్ని చిత్రవధ చేస్తున్నాడు. రుధిర ధారలు ప్రవహిస్తున్నాయి. నాలుగు నిమిషాలవరకూ పెద్దమనుష్యులు నిశ్చేష్టులై శిలాప్రతిమలవలె నిలబడివున్నారు. తదుపరి ముందుకు సాగివెళ్ళి హంతకుణ్ణి రెక్కలు పట్టుకుని యివతలకు లాగటానికి ప్రయత్నించారు. విద్యుత్ వేగంతో క్రూరబలంతో వూగిపోతూన్న హంతకుడు వారిని ఒకచేత్తో ప్రక్కకు నెట్టుతూ మరొకచేత్తో తనపని పూర్తిచేసుకున్నాడు. డొక్కల్లో పడ్డ పోటుతో వెంకటేస్ నేలమీదకు ఒరిగిపోగానే కత్తి దూరంగా విసిరేసి ‘ఇక మీరు శ్రమపడనక్కరేదు. నన్ను పట్టుకుని మీరేమేనా చెయ్యండి. నాకు ఇష్టమే’ అని వారి ముందు నిలబడ్డాడు హంతకుడు. అపుడు గురుపట్టగలిగారు హంతకుడు మల్లేస్ అని. రెండు నిమిషాలలో మల్లేస్‌లోని విద్యుత్ ఆవేశం పూర్తిగా తగ్గిపోయింది. రక్తపు మడుగులో పడివున్న తన అన్న శరీరాన్ని ఒక తడవ కళ్లు పెద్దవి చేసుకుని చూచాడు. ఎంతో వాత్సల్యపూరితంగా ‘తమ్ముడూ’ అని సంబోధించే ఆనోటినుండి రక్తపు బొట్లు రాలుతున్నాయి. తమ కుటుంబం కొంచెం దుర్దశాకాలంలో వున్నపుడు ‘విచారపడకు తమ్ముడూ! మనకు మంచిరోజులు రాకపోవు?’ అని ఆదరణగా తల నిమిరిన ఆ హస్తాలు నాలుగైదు ముక్కలుగా విరిగిపడి వున్నాయి. తనయెడల అధిక దయారసం ప్రవహింపచేసిన ఆ నేత్రాలు కాంతి క్షీణములై పోతున్నయ్. తనను చిన్నప్పటి నుంచీ ఎంతో లాలించి బుజగించి ప్రేమగా పెంచిన తన అన్న తన మూర్ఖత్వానికి బలియైపోతున్నా... మల్లేస్ హృదయంలో దుఃఖ ప్రవాహం పొంగింది. ‘నా అన్నను నేనే చంపుకున్నాను’ అని బిగ్గరగా విలపిస్తూ ఆ రక్తపు మడుగులో దొర్లుతున్నాడు. చుట్టూ కూర్చునివున్న పెద్ద మనుష్యులవంక వెంకటేస్ ఒక్కతడవ బాధగా కండ్లరెప్పలు విప్పిచూచి హీన కంఠస్వరంతో ‘నా తమ్ముడిపై హత్యానేరం మోపకండి, యీ విషయాన్నే మరణ వాఙ్మూలంగా చెప్తామనుకుంటె నాకు వ్యవధిలేకుండా పోతోంది.” అని అంటూ కళ్ళు మూశాడు. ఆదే ఆఖరిమాట అయింది. తర్వాత ఒక అరగంటకు పోలీసు ఉద్యోగస్థులు వచ్చారు. వారితో మల్లేస్ తానే హంతకుడని ఒప్పుకుని ఆవిధంగా వ్రాసియిచ్చాడు. అందుకు తగినట్లుగా అక్కడవున్న పెద్ద మనుష్యుల సాక్ష్యాలు కూడా తీసుకుని మల్లేస్‌ని బస్తీకి తీసుకునివెళ్ళి సబ్‌జైల్‌లో వుంచారు. కేసు నడుస్తూన్నపుడు కొంతమంది స్నేహితుల ప్రోద్బలంతో మల్లేస్ తన మనసును మార్చుకున్నాడు. “నేను హంతకుణ్ని కాదు. యీ హత్యతో నాకు ఏ మాత్రమూ సంబంధము లేదు. పోలీసువారి హింసాకాండను భరించలేక ఆవిధంగా స్టేట్‌మెంటిచ్చానని న్యాయస్థానంలో వాదించాడు. యీ కేసునుండి రక్షింపబడాలనే పట్టుదలతో తన కుండుకున్న మేడ, రెండెకరాల భూములు—యీ రెండింటినీ విక్రయించి ఆ పైకం ఖర్చుపెట్టి పెద్ద పెద్ద ప్రయత్నాలు చేశాడు. సుప్రసిద్ధుడైన ఒక బొంబాయి న్యాయవాదిని పిలిపించి తనపక్షాన వాదించుటకు న్యాయాధిపతుల ముందు హాజరుపరుచుకున్నాడు. చివరకు యీ ప్రయత్నాలన్నీ నిష్ప్రయోజనములైనాయి. కాని సెషన్సుకోర్టులో

విధింపబడిన జన్మఖైదును హైకోర్టులో ఎనిమిది సంవత్సరాల కారాగారవాసశిక్షగా తగించటం జరిగింది. ఖైదులో అతని మంచినడవడికిగాను ఒక సంవత్సర కాలం తగ్గింపుచేశారు. మిగిలిన ఏడుసంవత్సరాల శిక్షా కాలము పూర్తికాగానే మల్లేస్ బయటపడ్డాడు.

## 4

జైలునుంచి విడుదలయిన మర్నాటిరాత్రి ఏడు గంటల బండీకి స్వగ్రామపు రైలుస్టేషన్లో దిగాడు మల్లేసు స్టేషన్ గేటుదాటి బయటకు రాగానే అతి సమీపంలోవున్న మూడంతస్థుల మేడ అతని దృష్టికి తగిలింది. "రాత్రి బండీకి యీ ప్రదేశాల్లోనుంచి రావడానికి ఎంతో భయంగావుండేది. అటువంటిచోట యీ మేడలూ మిద్దెలూ వెలిసి ఎంత సందడిగావున్నదీ!' అని ఆశ్చర్యపడుతూ కొంచెందూరం వెళ్ళాడు. చెరువుకట ఎక్కగానే విద్యుత్కాంతులతో విలసిలుతూ గ్రామం ఎంతో శోభగా కనిపిస్తోంది. విస్మయంగా గబగబా నడవటం ప్రారంభించాడు. పల్లెటూరుకావటంమూలాన అప్పటికప్పుడే ఎనిమిదిగంటలైనా దాటకమునుపే వీధులలో జనసందడి తగ్గింది. నాలుగువీధులూ కలిసిన చౌకును సమీపిస్తూంటేగా అక్కడేదో శిలాప్రతిమవున్నట్లు దూరానికి కనిపిస్తోంది. దాని వెనుకవేపుభాగమును చూచి 'యే నాయకునిప్రతిమో అయివుండాలి. ఈమధ్య మారుమూలలవున్న పల్లెటూళ్ళలో సైతము యీ మోజు ఒకటి హెచ్చిపోయిందని జైల్లో రామన్ గాడు చెప్పాడు కదా! అని అనుకుంటూవున్నంతలో నే చౌకులోకి అతను రానేవచ్చాడు. ప్రతిమ ముందుభాగం వేపుకు వెళ్ళి నిలబడ్డాడు. అత్యంతాశ్చర్యంతో అతని మనసు ఉక్కిరిబిక్కిరవుతోంది. ఏ దేశనాయకుడిదో కాదు. ఆ శిలాప్రతిమ తన అన్న వెంకటేస్ ది. ప్రతిమకు కొంచెం అడుగున బిగించివున్న రాతిఫలకంపై 'పరోపకారం కొఱకు ప్రాణదానం సల్పిన అద్భుత వ్యక్తి—వెంకటేస్' అని లిఖింపబడిన గిల్టు అక్షరాలు విద్యుత్కాంతులలో తళతళలాడుతున్నాయి. ప్రతిమ పైభాగాన నాలుగు ఎలెక్ట్రిక్ బల్బులు బిగించారు. ప్రతిమ స్పష్టంగా మంచి హుందాతనంగా కనిపిస్తోంది. మల్లేస్ ఆ ప్రతిమలోకి ఏకాగ్రతతో దృష్టిబరుపుతూ నిలబడ్డాడు. తానొకవిధంగా తలిస్తే దైవం మరొకవిధంగా చేశాడు. తనకు చేసిన ద్రోహానికిగాను యీలోకంనుంచి తన అన్నను తొలగించి తీరాలని కత్తితో పొడిచి చంపాడు. ఆపనిచేసి తను తన మానవత్వాన్ని కోల్పోయాడు గాని తన అన్నను మాత్రం యీ ప్రపంచంలోనుండి పంపలేకపోయాడేమో? పైగా తనుచేసిన పనివలన వెంకటేస్ అజరామరుడై ప్రజలనుండి అనంతమైన భక్తిప్రపత్తులను పొందుతున్నాడు. అతనికీర్తి కుసుమాల సువాసనలతో గ్రామమంతా గుబాళించిపోతోంది. ముందు తరాలవారికి మార్గదర్శకుడు కాగలిగాడు. ఏదో కొద్ది ప్రపంచజ్ఞానం కలిగి సామాన్యుడుగా ఎంచబడుతూండే వెంకటేస్ కి యింత ఔన్నత్యాన్ని కల్గించి విఖ్యాతిని ఆర్జించి పెట్టి మహాత్ముల కోవలో జేర్చింది తన ప్రతీకారవాంఛేగదా! పైకి అపకారంగా కన్పించినా కొన్ని కొన్ని దుష్కార్యఫలితాలు, వాటిని అనుభవించినవాడికి అవాంఛనీయంగా కృషిశూన్యంగా ఎంతో వున్నతిని కూరుస్తయ్. తన ద్వేషం, కక్ష, తనకే చెరుపు చేసినయ్. సిగ్గుతో అవమానంతో ప్రతినిమిషమూ క్రుంగిపోవల్సిన క్షుద్రస్థితికిదింపినై. తన నొక క్రూర రాక్షసునిగాను, అతని నొక దేవాంశ సంభూతునిగాను లోకానికి చూపిస్తున్నాయి. మల్లేస్ అక్కడ్నించి కదలి ముందుకు వెళుతున్నాడు. కాని ఆ మొత్తిమలుపు తిరగగానే మల్లేస్ కాళ్ళు ఆకస్మికంగా ఆగిపోయినై. ముందుకు అడుగుపడటంలేదు. ఆ ఎదుటి గుమ్మంలో చంకన బిడ్డనిడుకుని ఎవరికోఅకో నిరీక్షిస్తూ నిలబడివున్న స్త్రీవేపు సూటిగా చూస్తున్నాడు. పిరుదుల్ని అనుతూవున్న పొడుగాటి వాల్జడ, ఆ జడ మొనల్లో కొద్దిగా యిరికింపబడి క్రిందకు జారిపోవడానికి సిద్ధంగా వున్న పెద్దమల్లెచెండూ, ఫేస్ పౌడర్ అధికంలో నలుపువర్ణాన్ని దాచుకుని నిగనిగలాడుతున్న ముఖము, పెదవులకు పూసుకున్న ఎరుపురంగు, చేతులు కదిలినపుడల్లా గలగలలాడే గోల్డు కవరింగ్ కంపెనీవారి గాజులు, ఆ వస్త్రధారణతీరు— సహజంగా సౌందర్యవతి కాకపోయినప్పటికీ యీ కృత్రిమపు మెరుగుల్లో ఆమెనుమా చేవారికికొంచెం చెంరూపసి మాదిరిగా నె తోస్తుంది. మొతనున్న ఎలెక్ట్రిక్ లైటుయొక్క కాంతుల్లో ఆమె ముఖం మల్లేసుకు స్పష్టంగా కనిపిస్తోంది. ఇక సందేహంలేదు. ఆ వన్నెలాడి తన భార్య అని వేరె ఎవరూ వచ్చిచెప్పనక్కరేదు. ఆ ఇంటివాకిలి ముందుకువెళ్ళి నిలబడి "ఆ బిడ్డ ఎవరు వెంకులూ?" అని అడిగాడు మల్లేస్ కొంచెం ఉత్సాహం తెచ్చుకుని.

"నా పిల్లే! నువు పిలిచిన పేరు ఏడెనిమిదేళ్ళనాటిది. ఇప్పుడు నా పేరు కోమలాంగి. ఆ రకంగా గెజెట్ లో ప్రచురణ చేయించాడు కూడాను మా ఆయన."

"ఏమిటి మీ ఆయనా! నీ పిల్లా!...మల్లేస్ మాటలు తడబడుతున్నాయి అతని కంఠస్వరం తీవ్ర కంపనాన్ని పొందుతోంది.

"అసలెవరయ్యా నువ్వా? వెంకులూ అని పిలుస్తున్నావ్" అని అంటూ గుమ్మందాటి ఒక మెట్టు

క్రిందకు దిగివచ్చి మల్లేస్ ముఖాన్ని తేరిపార చూసింది. అతని ముఖాన్ని క్షణమాత్రంలో గుర్తించింది. గిరుక్కున వెనక్కు తిరిగి "ఆరి పాపిష్టివాడా? ఊళ్ళోకి మళ్ళీ దాపురించావ్? ఫో! అవతలకు ఫో! ఖూనీలు చేసినవాడా." అని తిట్టుకుంటూ లోపలకు వెళ్ళి పెడేలున తలుపు రెక్కల్ని మూసుకుంది. నేత్రాల్లో ఉబుకుతూన్న జలబిందువుల్ని చేత్తో తుడుచుకుంటూ వెనక్కు తిరిగివచ్చి మల్లేస్ రోడ్డుపై నిలబడ్డాడు. దుఃఖాల వేడితో ఎండుకుపోయిన అతని అంతస్సు తీవ్రమైన వేదనతో మూలిగింది. తనకు మిగిలిన యీ ఒక్క ఆశాకిరణంకూడా నలిగిపోయింది. ఇక తనకీ ప్రపంచంలో ఎవరూ లేరు. ఏదీ లేదు, సౌఖ్యం యివ్వగల ధనం లేదు. ప్రేమింపగల భార్యలేదు. ఆదరింపగల అన్న లేడు. కీర్తి ప్రతిష్ఠల నివ్వగల వ్యక్తిత్వం లేదు. అన్నిటినీ అందర్నీ కోల్పోయి అననూన భారంతో తలఎత్తలేక అమానుష జ్ఞాపకాల ఒత్తిడిని సహింపలేక శరీరమంతా తూల్లిపడిపోయిన తనకు యింకా యీ జీవితం దేనికి? ఇంతలో శీతలవాయువులు అతని శ్రవణపుటములకు ఒక హోరుధ్వని అందింపచేసినయ్. 'ఔను, ఏఱుపొంగే రోజులు కదా! ఆ నదిమాతే నాకు ఆత్మశాంతిని కల్గింపగల దివ్యౌషధం' అని అనుకుంటూ ముందుకు సాగి నడవటం ప్రారంభించాడు. కాని నాలుగు ఇళ్ళు దాటగానే మనసులోకి ఏదో ఆలోచన వచ్చి అతను ఆగి నిలబడ్డాడు. ఎదురుగా అరుగుపై ఆసీనుడై యున్న వేదపండితుడు తన యజ్ఞోపవీతాన్ని పొడుగ్గా సాగతీసుకుంటూ వేదమంత్రాలు వల్లెవేసుకుంటున్నాడు. మల్లేసు ఆయనకు కొంచెం సమీపంగా వెళ్ళి "శాస్తురు గారూ! యీ మొత్తమీది యింట్లో కాపురమున్నావిడ ఎవరండీ?" అని అడిగాడు. వెంకులు పరిస్థితి కొంచెము తెల్సుకుందామనే ఉద్దేశ్యంతో. "ఆవిడా— ఆవిడ మొదటభర్తతో కాపురం చేసినపుడు వెంకమ్మ. రెండో భర్తను కట్టుకున్న తర్వాత కోమలాంగి. ఐనా దానిసంగతి మనకెందుకులే. ఇప్పుడు యీ మాటలే వేనా వినిపించుకున్నదా అంటే దాని బూతుల పన్నాల కాగలేక నా వేదపన్నాలకు స్వస్తి చెప్పి ఇంట్లో దూరాలి. అటువంటి రకమంతా అంతేనయ్యా. అటావుంటేనేగాని వాళ్ళు సంఘంలో జీవింపలేరు" "ఆవిడ విషయం నాకు కొంచెం అవసరమైంది. మీకు తెల్సిందేదో కొంచెం చెప్పండి అయ్యగారూ." "దానికిప్పటివరకూ రెండు వివాహాలని మాత్రం నాకు రూఢిగా తెలుసు...పాపం మొదటభర్త మల్లేసు అని ...వాడు మంచివాడే మరి...ఏం దుర్బుద్ధి పుట్టిందో ఏమో అన్నను కాస్తా కత్తితో పొడిచి చంపేశాడు. శిక్షపడి వాడు జైలుకి వెళ్ళిన మూడు మాసాలకే యిది ఒక మోటారు డ్రైవర్ని కట్టుకుని కులుకుతోంది...ఇది దాన్ని గురించి నాకు తెల్సిన సమాచారం. అసలు నువ్వెవరివి నాయనా? ఇప్పుడు నువ్వు దాని వాకిట్లోంచి వస్తూన్నట్లుందే"

"గుర్తుపట్టలేదా శాస్తుర్లగారూ? నేను మల్లేసును."

"అట్లగురా నాయనా? నువ్వు మల్లేసువా? జైలు నుంచి విడుదలై ఎప్పుడు వచ్చావ్? దాని వాకిట్లోకి ఎందుకురా వెళ్ళావ్? మల్లేస్, నువ్వు పెళ్ళిచేసిన ఇలు ఆదికాదు. అదిగో ఆ యింటికివెళ్ళు. ఆ మహాతల్లి నీకోసరం కాచుకుని కూర్చుంది. నీకు మళ్ళా వివాహం చేసి తన అత్తింటివంశం రూపుమాసి పోకుండా కాపాడాలని ఆతురతపడుతోంది."

మల్లేస్ మౌనంగా కదిలి ముందుకు వెళ్ళుతున్నాడు. నిజంగా తన అన్న. వదినె--వారిద్దరూ పుణ్యజీవులు. ఆమె తనభర్తను దైవసమానంగా భావిస్తూండేది. అతడు తన భార్యను ఎంతో ప్రేమగా చూసుకుంటూండేవాడు ఆ జంటను తన దారుణహస్తాలు విడదీసినై. ఆమె భర్తను వధించి ఆమె సుఖాలను మంటగల్పిన వాణ్ని గురించి ఎంత దయగా ఆలోచింపగలుగుతోంది? కాస్తా కూస్తా దైవత్వాన్ని సాధించి వుంటేనే తప్ప, లేకపోతే మాత్రం మానవజీవికి ఇంత శాంతి సహనాలు అసంభవాలు! మల్లేసు తన అన్న ఇంటి ముందుకు వచ్చాడు. నెమ్మదిగా అరుగుమీదకు వచ్చి కూర్చున్నాడు. గుమ్మంలో కూర్చుని వున్న వదిన సంతోషంతో ఉప్పొంగిపోతూ లేచి నిలబడి "వచ్చావా మరిదీ? జైలు ఇన్స్పెక్టర్ గారికి వారంరోజుల క్రిందట ఉత్తరం వ్రాశాను. గురువారంనాడు విడుదల జరుగుతుందని వారు జవాబు వ్రాశారు. ఇవ్వాళ శుక్రవారం కదా. ఇంతవరకూ రాలేదేమా అని నీకోసం ఎదురు చూస్తున్నాను." అన్నది. "నాకోసం ఎదురుచూడటంలోగల నీ అభిప్రాయం నేను యింతకు ముందే తెలుసుకున్నాను వదినా! నీ బ్రతుకుబాటల్లో బడబాగ్ని సృష్టించిన యీ జన్మశత్రువుపై నీకీ దయ ఎలా కలుగుతోందమ్మా. నీ ప్రేమాభిమానాలు పొందటానికి తగిన అర్హత నేను ఏనాడో కోల్పోయినాను తల్లీ! నీ పవిత్రమూర్తిత్వానికి ఒకతడవ వినయవినమ్రముగానైనా నమస్కరించాలని వున్నది. కాని ఆ పరమశాంతిమూర్తిని చిత్రవధ సల్పిన యీ దుష్టహస్తాల్ని జోడించి ఆపని చేయలేకుండా వున్నాను..." అని అంటూ అరుగు దిగి వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు చరచరా నడిచివెళుతున్నాడు మల్లేస్. అక్కడ వీధి దీపాలు లేవు. గాఢాంధకారం వికృతంగా ధ్వనిస్తోంది. బాట కిరుప్రక్కలా వున్న పెద్దపెద్ద వృక్షాలు చీకటి భూతాల్లాగా నిలబడివున్నాయ్. ఊహాపనపు హద్దుల్ని సంకుచితపరిచే మాన

వుని అజ్ఞానంలాగా రోడుపొడుగునా బారులు తీర్చి వున్న ఆ వృక్షాలు తమ ప్రక్కలనున్న ప్రదేశాల్ని కనుపించనీయటం లేదు. గగనభాగంలో అక్కడక్కడ చెదురుగా కదుల్తూవున్న నల్లమబ్బు తునకలను మహావుపాయంగా తప్పించుకుంటూ నిర్మలంగా వున్నచోట్లన మాత్రం నీటుగా నడుస్తున్నాడు అష్టమి చంద్రుడు. మానవజాతిలో ఆనాటి కౌనాడు విజృంభింమను పోతూన్న అసూయాద్వేషాల ఉద్రేకతకు భూదేవి హృదయపు లోతుల్లోనుంచి బయల్దేరిన ఆక్రందన స్వరం అన్నట్లుగా, నదీ ప్రవాహం భయంకరమైన హోరుధ్వనిని సృష్టిస్తూ అనంతవేగంతో ముందుకురుకుతోంది. తనకు అడ్డుతగిలిన దానినల్లా విరగద్రొక్కి తన గర్భంలో దాచుకునే నదీప్రవాహంయొక్క ప్రవర్తనే మానవుడికి మొదటగా అధికారం, ఆవేశం, నిరంకుశత్వాలను నేర్పి వుండవచ్చునేమో?

మల్లేస్ ఒడ్డుమీదకు వచ్చి కూర్చున్నాడు. సమీపంలోనే వున్న శ్మశాన స్థలంలో శవ దహనం జరుగుతోంది.

మల్లేస్ తన హస్తాల్ని కళ్ళ ముందు పెట్టుకుని తీరికగా చూసుకుంటున్నాడు. ప్రతి హస్తరేఖలోనుంచీ తన అన్న మృత్యుబాధ పడుచూన్నప్పుడు వెలువడిన సన్నని మూలుగు ధ్వనులు వినిపిస్తున్నాయి. ప్రతి వ్రేలి చివర కొసలోనూ కత్తి పోటుతో నిండి వున్న తన అన్న మృతశరీరం కనిపిస్తోంది. యీ రాక్షస హస్తాలవలన లోకంలో యికనైనా మరెవ్వరికీ అకృత్యాలు జరక్కుండా నదిగర్భంలో దాచుకోగలటమే తను యీ జన్మములో చేయగలిగిన పుణ్యకార్యం!

తన అన్నను హత్యచేసే ముందు అతని గుండెల్ని వూపిన ఆవేశమే మరల యిప్పుడు కూడా అతనిలో ప్రవేశించింది. ఆనాడు ఆ సంకల్పంనుండి దిగజారిపోకుండా అతని మనసును ఎలాటి త్రాళ్ళతో కట్టి వేయగలిందో, యీనాడు కూడా యీ భావన నుండి తిరిగి పోకుండా తగిన ఏర్పాట్లు చేసింది. అతని అధరాల సందునుంచి ఒక మందస్మితరేఖ ఒలికింది. ఆ నవ్వు తననుండి ప్రపంచవాసనల్ని దూరం చేసింది. ఇక తను స్వతంత్రుడు! మల్లేస్ మహోత్సాహంగా, క్రొత్తగా ఆవిర్భవించుకొచ్చిన బలంతో లేచి నిలబడి అయిదు నిమిషాలపాటు నదీమతను గూర్చి మనసులో ధ్యానం చేసుకున్నాడు. తరువాత నెమ్మదిగా ఒడ్డునుంచి దిగి నదిలోకి ప్రవేశించాడు. ఏకాగ్రచిత్తంతో ముందుకు నడిచివెళ్ళుతున్నాడు. నదీమాత సంతోషహృదయంతో అతనికి స్వాగతం యిస్తోంది. కొంచెం దూరంలోవున్న చెరువులో చేపలుపడుతూ గట్టుమీద నిలబడిన ఒక సిపాయి గబగబా పరుగెత్తుకుని వచ్చి నదిలోకి దూకేడు. యీదుకునివెళ్ళి రెండు మునకలు పూర్తిఅయి మూడో మునకతో ప్రాణాలు విడవడానికి సిద్ధంగావున్న మల్లేసును భుజాలమీద వేసుకుని ఒడ్డుకు తీసుకొచ్చాడు. నీరు బాగా త్రాగి వుండటం మూలాన మల్లేసుకు కొంచెంగా స్మృతి తప్పింది. రెండెడ్ల బండీమీద వేసుకుని ఆ దగ్గరగా వున్న గ్రామపు పోలీసు స్టేషన్‌కు చేర్చాడు. కొంత సేపటికి మల్లేస్ కళ్ళు విప్పిచూచాడు. ఎదురుగా సబ్ ఇన్‌స్పెక్టర్ నలుగురు పోలీసు జవానులు నిలబడి వున్నారు.

మల్లేసుపై ఆత్మహత్యా నేరంమోపి పోలీసు వారు కేసు పెట్టారు. మొదటి శ్రేణి మేజిస్ట్రేట్ కేసు విచారించి మల్లేసుకు సంవత్సరన్నర కఠిన శిక్ష విధించి మళ్ళా జైలుకు పంపించాడు!

ఉపయోగమైన సరిక్రొత్త పుస్తకములు
వ్యవసాయము - ఇంజనీరింగు, వైద్యము, వగైరా అనేక గ్రంథములు. కేటలాగు ఉచితము. ఇంగ్లీషులో వ్రాయండి.
N. K. Paul & Sons, Post 12202, Calcutta-5.